
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కర్నూలు

జిల్లా వార్తలు

5

ఆదివారం 1 డిసెంబరు 2024

నగరంపై మంచు దుప్పటి



చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఉదయం 8 గంటల వరకు కర్నూలు నగరాన్ని మంచు దుప్పటి కప్పేస్తోంది. అల్ప పీడనం ప్రభావంతో రెండు మూడు రోజుల నుంచి పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. ఉదయం నుంచి రాత్రి వరకు చల్లటి గాలులు వీస్తున్నాయి. శనివారం ఉదయం 9 గంటల సమయంలో జగన్నాథ గట్టుపై నుంచి చూస్తే మంచు తెరల మధ్య కర్నూలు నగరాన్ని మసకమసకగా కనిపించిన దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి తన కెమెరాలో బంధించింది.

-కర్నూలు రూరల్ (ఆంధ్రజ్యోతి)



పేదలపై ఫీజుల పిడుగు

పేద విద్యార్థులపై ఫీజుల పిడుగు పడింది. విద్యా హక్కు చట్టం ప్రకారం (ఆర్‌టీఈ) ప్రైవేట్ పాఠశాలల్లో చేరిన వారికి గత ప్రభుత్వం నామమాత్రపు ఫీజు కూడా చెల్లించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఆ అంశంపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయి. దీంతో ఫీజు చెల్లించలేక విద్యార్థులు బయటికి వచ్చే దుస్థితి నెలకొంది. ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు కార్పొరేట్ విద్య అందని ద్రాక్షగా మారనుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- 3,906 మందికి 'ప్రైవేట్'లో ప్రవేశాలు
- నిలిచిన 'నామమాత్రం' చెల్లింపులు
- విద్యార్థులపై యాజమాన్యాల ఒత్తిళ్లు
- విద్యా హక్కు చట్టానికి తూట్లు
- బడుగులకు భారంగా కార్పొరేట్ విద్య



కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టం (ఆర్‌టీఈ) ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లలో ప్రవేశాలు కల్పించే నిమిత్తం గత వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు రద్దు చేసింది. ఆ జీవో బాలల రక్షణ జాతీయ కమిషన్ జారీ చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్లకు (ఎస్‌వోసీ) విరుద్ధంగా ఉందని స్పష్టం చేసింది. ఆర్‌టీఈ చట్టం ఉద్దేశాన్ని జీవో 24ను నెరవేర్చకపోగా నీరు గార్చేదిగా ఉందని పేర్కొంది. 25 శాతం సీట్ల కోటాలో చేరే పిల్లలకు ఫీజుల నిర్ణయం విషయంలో పిటిషనర్ల భాగస్వామ్యం పక్షాల అభ్యంతరాలు, సూచనలను ప్రభుత్వ పరిగణనలోకి తీసుకోలేదని ఆక్షేపించింది. ఆ జీవోను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. పాఠశాలల్లో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిధిలోకి తీసుకోకుండా ఫీజులను ఖరారు చేశారని పిటీషన్‌లో పేర్కొన్నట్లు తెలిపింది. విద్యార్థులు చెల్లించాల్సిన ఫీజులను అమ్మఒడి పథకం కింద తల్లుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని ప్రభుత్వం చెప్పడం చట్టవిరుద్ధంగా ఉందని అభిప్రాయపడింది.

జిల్లాలో 3,906 మంది అడ్మిషన్లు

విద్యా హక్కు చట్టం కింద కర్నూలు జిల్లాలో 2022-2023 నుంచి 2024-2025 విద్యా సంవత్సరం వరకు మూడు సంవత్సరాల్లో 25 శాతం సీట్ల కింద మొత్తం 5,634 సీట్లు కేటాయించారు. ఇందులో 3,906 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందగా 1728 మంది వారికి కేటాయించిన పాఠశాలల్లో చేరలేదు. 2022-2023 విద్యా సంవత్సరంలో జిల్లాలో 183 సీట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు కేటాయించారు. ఇందులో 158 మంది వివిధ పాఠశాలల్లో అడ్మిషన్లు పొందగా మరో 25 మంది విద్యార్థులు పాఠశాలల్లో చేరలేదు. అలాగే 2023-2024 విద్యా సంవత్సరంలో 2,119 సీట్లు కేటాయించగా 1395 మంది చేరగా 724 మంది చేరలేదు. 2024-2025 విద్యా సంవత్సరంలో 3,332 సీట్లు కేటాయించారు. 2353 మంది పాఠశాలలో చేరగా 979 మంది అడ్మిషన్లు పొందలేదు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 24ను హైకోర్టు రద్దు చేసింది. ఆర్‌టీఈ చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించాలి. ఆర్‌టీఈ చట్టం కింద అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఏడాదికి ఒక్కొక్క విద్యార్థికి అర్బన్ ప్రాంతంలో రూ.8 వేలు, గ్రామీణ ప్రాంతంలో రూ.6,500, ట్రైబల్ ఏరియాలో రూ.4వేలు మాత్రమే ఫీజులు చెల్లించేలా నిర్ణయించారు.



పేద విద్యార్థులకు భారంగా మారిన విద్య

గత ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు రద్దు చేయడంతో కార్పొరేట్ విద్య పేద విద్యార్థులకు భారంగా మారింది. పూర్తి ఫీజులు చెల్లించాలని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. అర్థాంతరంగా జీవో రద్దు కావడంతో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నెత్తిన పిడుగు పడినట్లయింది. వేలకు వేలు ఫీజులు చెల్లించలేకనే ప్రభుత్వం ఆర్‌టీఈ కింద నామమాత్రపు ఫీజుతో అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తే చేర్పించామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని తాము భారీ మొత్తంలో ఫీజులు ఎలా చెల్లించగలమని ప్రశ్నిస్తున్నారు.



ఇది అనాలోచిత నిర్ణయం

గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయం తీసుకుంది. ఈ జీవో సరైంది కాదని గతంలోనే చెప్పాం. అయినా బలవంతంగా జీవోను జారీ చేసింది. ఆర్‌టీఈ కింద అడ్మిషన్లు పొందిన పిల్లల ఫీజులు గత ప్రభుత్వం చెల్లించలేదు. ఈ ఏడాది సంబంధించి ఇప్పటి వరకు పైసా కూడా ఇవ్వలేదు. ఈ విద్యార్థులకు సంబంధించిన ఫీజులు ప్రభుత్వం, ఇటు తల్లిదండ్రులు ఇవ్వకపోతే తమ పాఠశాలలు ఎలా నడపాలి. కోర్టు తీర్పును మేం స్వాగతిస్తున్నాం. పెండింగ్‌లో ఉన్న ఫీజులను ప్రభుత్వం చెల్లించాలి. చట్టం వేరు.. జీవో వేరు.. ఒకదానికొకటి ముడి పెట్టడం ఏమిటి?

- కర్నూలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (అపుస్మా) జిల్లా అధ్యక్షుడు బి. వాసుదేవయ్య

ఈ విద్యా సంవత్సరానికి కొనసాగేలా చూస్తాం

విద్యాహక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులపై అదనపు ఫీజుల భారం పడకుండా ఈ విద్యాసంవత్సరం పూర్తయ్యే వరకు అవకాశం ఇవ్వాలని రాష్ట్ర స్థాయి విద్యాశాఖ అధికారులను కోరుతాం. ఆర్‌టీఈ చట్టం కింద చేరిన విద్యార్థులపై ఫీజుల కోసం ఒత్తిడి చేయవద్దని ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లకు చెప్పాం. ఇది ప్రభుత్వ నిర్ణయం. రాష్ట్ర స్థాయి అధికారుల ఆదేశాలు వస్తే బావుంటుంది. - శ్యామ్యూల్ పాల్, జిల్లా విద్యాశాఖ అధికారి, కర్నూలు

అర్హులందరికీ పింఛన్

- 2,40,330 మందికి రూ.102.55 కోట్ల పంపిణీ
- కలెక్టర్ పి. రంజిత్‌బాషా



వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు న్యూసిటీ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద జిల్లాలో అర్హులందరికీ పింఛన్ పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. శనివారం నగరంలోని జొహరాపురంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద అచ్చమ్మ, లచ్చమ్మకు వృద్ధాప్య పింఛన్, ప్రమీలమ్మకు వితంతు పింఛన్, జ్యోతికి ఒంటరి మహిళ పింఛన్ వారి ఇండ్ల వద్దకే వెళ్లి కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 1 ఆదివారం కావడంతో ఒక్కరోజు ముందే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం ద్వారా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నూతన మార్గ దర్శకాలు జారీ చేసిందన్నారు. కుటుంబ యజమాని మరణించిన వెంటనే అందుకు సంబంధించిన డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేస్తే, తదుపరి నెలలో అతని భార్యకు పింఛన్ మంజూరవుతుందని అన్నారు. అనంతరం కేసీ కెనాల్ ప్రాంతాన్ని, డంప్ యార్డును కలెక్టర్ పరిశీలించారు. కేసీ కెనాల్‌లో ఎవ్వరూ పొరపాటున జారి పడకుండా కంచెలు వేయించాని నగర పాలక కమిషనర్ రవీంద్రబాబును ఆదేశించారు. డంప్ యార్డును శుభ్రం చేయించాలన్నారు. జోహరాపురం నుంచి వెంకాయపల్లె వరకు 3 కిలో మీటర్ల రోడ్డు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఆర్‌డీఓ సందీప్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ శివనాగలీల తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

ఓర్వకల్లును ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చుతాం ● మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, ఎన్‌ఎండీ ఫరూక్ ● కాల్వబుగ్గలో ఘనంగా కోటి దీపోత్సవం ● హాజరైన ఎమ్మెల్యేలు, టీడీపీ శ్రేణులు



కాల్వబుగ్గలో కోటి దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

ఓర్వకల్లు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఓర్వకల్లును ఇండస్ట్రియల్ హబ్‌గా మారుస్తామని మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ వెల్లడించారు. శనివారం ఓర్వకల్లు మండలంలోని కాల్వబుగ్గలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో కార్తీక వనభోజనం, కోటి దీపోత్సవం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బుడ్డా రాజశేఖర్ రెడ్డి, గిత్తా జయసూర్య తదితరులు హాజరయ్యారు. వీరికి మల్లెల రాజశేఖర్, ఆలయ ఈఓ మద్దిలేటి, ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శివుడికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ వద్ద కోటి దీపోత్సవాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు వెలిగించారు.

బహిరంగ సభలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక టీడీపీ నాయకులు, కార్యకర్తలు అన్ని విధాలుగా నష్టపోయారన్నారు. వారందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రజలు జగన్ హయాంలో చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, రహదారులకు మరమ్మతులను వేగవంతంగా చేస్తున్నామన్నారు. కార్తీక మాసం ఎంతో పవిత్రమైనదని, అందరం కలిసి వనభోజనాలకు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో ఓర్వకల్లును పారిశ్రామిక కేంద్రంగా గుర్తించి సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఓర్వకల్లు ప్రాంతంలో విమానాశ్రయం ఉండటంతో 300 ఎకరాల్లో డ్రోన్ హబ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కర్నూలుకు హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేశార నీ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసే దిశ గా ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. టీడీపీ పాలక మండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్ మాట్లాడు తూ తనకు పదవి ఇచ్చిన సీఎంకు, మంత్రి లోకేష్‌కు ధన్యవా దాలు తెలిపారు. సహకరించిన మంత్రులు, ఎమ్మెల్యేలకు కూడా ధన్యవాదాలు తెలిపారు.

మిగతా 6లో..



కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు



మల్లెల రాజశేఖర్‌కు సన్మానం

30 ఏళ్ల తర్వాత..

- కడిమెట్లలో టీడీపీ సభ్యత్వ నమోదు
- మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట ఇలాఖాలో టీడీపీ శిబిరం



ఎమ్మిగనూరు మండలం కడిమెట్ల గ్రామంలో సభ్యత్వ నమోదు చేస్తున్న టీడీపీ నాయకులు

ఎమ్మిగనూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కడిమెట్ల.. ఈ పంచాయతీనే కాదు.. ఇందులోని పల్లెలన్నీ మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డికి పెట్టని కోట. ఈ పంచాయతీలో ఎర్రకోట చెప్పిందే శాసనం. ఆయన ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీలోనే ఉండేవాళ్లు ప్రజలు. ఎర్రకోట మాటను ఆ పల్లెలో ఏ ఒక్కరూ జవదాటరు. ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ఇలాఖాలో 30 ఏళ్ల తర్వాత టీడీపీ సభ్యత్వ నమోదు తొలిసారి చేపట్టారు. కడిమెట్ల గ్రామంలో టీడీపీ నాయకులు శనివారం ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి సభ్యత్వ నమోదు చేపట్టడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ముందు మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి సమీప బంధువులు, మండల నాయకులు విరుపాక్షిరెడ్డి, చెన్నారెడ్డి, సూర్యనారాయణ రెడ్డిలు టీడీపీలో చేరారు. ప్రస్తుతం వారి ఆధ్వర్యంలోనే కడిమెట్లలో టీడీపీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఏ పార్టీలో ఉంటే కడిమెట్ల పంచాయతిలోని కడిమెట్ల, ఎర్రకోట, శీరాలదొడ్డి, రాళ్లదొడ్డి గ్రామాల ప్రజలు అటు వైపు నడిచేవారు. దీంతో ఆ గ్రామాల్లో గత కొన్నేళ్లుగా టీడీపీ జెండా ఎగిరిన దాఖలాలు లేవు. ఒకరిద్దరు నాయకులు టీడీపీ కార్యక్రమాల్లో పాల్గొంటు వచ్చారే తప్ప గ్రామంలో ఎలాంటి కార్యక్రమాలు చేయలేకపోయారు. మాజీ ఎమ్మెల్యే సమీప బంధువులు, కొంతమంది యువకులు ఎన్నికలకు ముందు టీడీపీలో చేరటంతో ఎలాగైన టీడీపీ జెండా ఎగురవేయాలని ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో గ్రామంలో జరిగిన దేవర కార్యక్రమానికి ఎన్నికల వేళ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి హాజరయ్యారు. టీడీపీ అధికారంలోకి రావటంతో దాదాపు 30ఏళ్ల తరువాత గ్రామంలో మొదటిసారి టీడీపీ సభ్యత్వ నమోదు శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. కడిమెట్లతో పాటు ఎర్రకోట, రాళ్లదొడ్డి, శీరాలదొడ్డి గ్రామాల్లో సభ్యత్వ నమోదు వేగవంతం చేస్తామని టీడీపీ నాయకులు చెన్నారెడి, సూర్యనారాయణ రెడ్డిలు తెలిపారు.

పూర్వ విద్యార్థులకు ఆహ్వానం

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 7న జరిగే పేరెంట్స్, టీచర్స్ మెగా సమావేశానికి ఆయా పాఠశాలల పూర్వ విద్యార్థులు హాజరు కావాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా పిలుపునిచ్చారు. జిల్లాలో వివిధ పాఠశాలల్లో చదివిన పూర్వ విద్యార్థులు రాష్ట్ర వ్యాప్తంగా లేదా దేశ వ్యాప్తంగా ఎక్కడున్నా వారు చదువుకున్న పాఠశాలల్లో డిసెంబరు 7న ఈ సమావేశానికి హాజరుకావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమావేశాన్ని విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు నిర్వహిస్తోందని అందులో పూర్వ విద్యార్థులు కూడా భాగస్వాములు కావాలని అన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులకు సత్కారం

(5వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కార్తీకమాసంలో నెల రోజులుగా భక్తిశ్రద్ధలతో ప్రతి ఒక్కరూ పూజలు చేస్తున్నారని, పవిత్రమైన బుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో వనభోజన ఏర్పాట్లు చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక సీఎం చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబునాయుడు, ఓర్వకల్లు ఎస్‌ఐ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, నంద్యాల పార్లమెంటు ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ అహ్మద్, ఏపీ మార్క్‌ఫెడ్ సభ్యులు తులసిరెడ్డి, డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, కైప పద్మలతా రెడ్డి, అర్బన్ ఫైనాన్స్, సివిల్ సప్లైస్, వాల్మీకి, యాదవ, గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్లు రామాంజనేయులు, బోయ మహేష్, వలసల రామకృష్ణ, వెంకటేశ్వర్లు యాదవ్, అరుణ కుమార్‌నాయక్, ముదావత్ జీవ్లా నాయక్, పొదుపులక్ష్మి గౌరవసలహాదారు విజయభారతి, నాయకులు గోవిందరెడ్డి, సుధాకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, చంద్రపెద్దస్వామి, ఆకుల మహేష్, కాకి దేవేంద్ర, కేవీ మధు, మహబూబ్ బాషా, గొల్ల నాగరాజు, వెంకటరమణ, నంద్యాల జిల్లాలోని టీడీపీ నాయకులు, పాణ్యం నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ, నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. కాగా ప్రముఖులకు హుశేనాపురం ముస్లిం మైనార్టీ నాయకులు మహబూబ్ బాషా గజమాలతో సత్కరించారు. కార్యక్రమానికి హాజరైన అతిథులకు మల్లెల రాజశేఖర్ ఘనంగా సత్కరించి టీటీడీ ప్రసాదాలను అందజేశారు. ప్రభుత్వ శారదా సంగీత నృత్య కళాశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. వీరికి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి రూ.50వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు.



సాంస్కృతిక నృత్య ప్రదర్శన

ఆశయం aashayam



ఆత్మస్థైర్యమే ఆమెకు ఆయుధమైంది. మనోవిశ్వాసమే ముందుకు నడిపించింది. అనుకున్న లక్ష్యం ముందు అంగవైకల్యం చిన్నబోయింది. క్రీడా రంగాన్ని ఎంచుకొని అందులో రాణిస్తోంది. మద్దికెరకు చెందిన శివాని

ఎమ్మిగనూరు మండలం బనవాసిలోని నవోదయ పాఠశాలలో 10వ తరగతి చదువుతూ జాతీయ జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంది. జావెలిన్ త్రోలో బంగారు పతకం సాధించింది. ఆసక్తి, శ్రద్ధ, లక్ష్యం ఉండాలే కానీ.. అంగవైకల్యం చిన్నబోక తప్పదని నిరూపించింది. అందరితో ఔరా అనిపించుకుంటోంది.



ఆత్మస్థైర్యమే ఆయుధం

- చిన్నబోయిన అంగవైకల్యం
- జావెలిన్ త్రోలో శివానికి బంగారు పతకం

మద్దికెర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మద్దికెర గ్రామంలోని పందులకుంట వీధిలో నివసించే ఉప్పర లలిత, వీరప్ప దంపతుల కుమార్తె శివానికి చిన్నతనంలోనే పోలియో సోకింది. దీంతో ఒక చేయి సరిగాలేదు. అయినప్పటికీ తల్లిదండ్రులు ఆమెను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు తమ శాయశక్తులా కృషి చేశారు. ఆకుకూరలు అమ్ముతూ జీవనం సాగించే తల్లిదండ్రులను శ్రమను కూడా శివాని గుర్తించింది. తల్లిదండ్రుల ఆశయ సాధనకు శివాని నిరంతరం పోరాడుతూ అందరి ప్రశంసలు పొందుతోందిది. ఒకటి నుంచి 5వ తరగతి వరకు మద్దికెరలోని ఓ ప్రైవేటే పాఠశాలలో చదివింది. 6 నుంచి బనవాసిలోని నవోదయ పాఠశాలలో చేరారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. తండ్రి వీరప్ప ఆకుకూరల వ్యాపారం చేస్తున్నాడు. శివాని 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు స్థానిక విద్యాసాయి కళాశాలలో చదువుకుంది. 8వ తరగతి నుంచి అవుట్‌పుట్ జావిలెన్ త్రో విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో రాణిస్తూ వస్తోంది. ఇటీవల గుజరాత్ ఎఫ్-46 విభాగంలో జావెలిన్‌త్రోలో పాల్గొని బంగారు పతకం సాధించింది. శివానిని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై పథకం అందించి అభినందించారు. ప్రస్తుతం హైదరాబాదులోని నవోదయ జవహర్ పాఠశాలలో చదువుకుంటోంది.



తల్లి దూరమైనా..

శివాని గెలుపుబాటలో పయనించేలా నిత్యం ప్రోత్సహించిన తల్లి లిఖిత ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందింది. తన తల్లి కూడా దూరం కావడంతో ఆ విద్యార్థిని కుంగుబాటుకు గురైంది. థాయిలాండ్‌లో 2025 జనవరిలో జరిగే పోటీలకు సిద్ధమవుతున్న తరుణంలో తన తల్లి దూరం కావడంతో ఒకింత నిరాశ ఆమెను అవహించింది. తల్లి కోరిక నెరవేర్చాలని పోటీల్లో పాల్గొనాలని తండ్రి వీరన్న ధైర్యం ఇస్తూ వచ్చారు. కుమార్తెను ఉన్నతంగా తీర్చిదిద్దాలని తపిస్తున్న తండ్రిని చూసి గ్రామస్థులు సైతం అభినందిస్తున్నారు.



తల్లిదండ్రులు లలిత, వీరప్పలతో శివాని





బంగారు పతకం సాధించి..

ఇటీవల గుజరాత్‌లో జరిగిన జాతీయ జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఎఫ్-46 విభాగం జావెలెన్‌త్రోలో శివాని సత్తా చాటి బంగారు పతకం సాధించింది. రాష్ట్ర గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా పతకం, పురస్కారం పొందారు. గత ఏడాది నవంబరులో థాయిల్యాండ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ జావెలిన్‌త్రో పోటీల్లో ప్రతిభ కనబరిచింది. వచ్చే ఏడాది జనవరిలో మరోసారి థాయిలాండ్‌లో జరిగే పోటీలకు ఎంపికైనట్లు తండ్రి వీరన్న తెలిపారు.

మార్కెట్ సెస్సు లక్ష్యాన్ని చేరుకుంటాం

మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన సెస్సు లక్ష్యాన్ని చేరుకుంటామని కర్నూలు జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి అన్నారు. కర్నూలు మార్కెట్ కమిటీకి రూ.7.60 కోట్లు, ఆదోని నుంచి రూ.17.10 కోట్లు, ఎమ్మిగనూరు నుంచి రూ.6.10 కోట్లు, ఆలూరు నుంచి రూ.1.20 కోట్లు, పత్తికొండ మార్కెట్ కమిటీ నుంచి రూ.82 లక్షలు, కోడుమూరు మార్కెట్ కమిటీ నుంచి రూ.1.90 కోట్లు, మంత్రాలయం మార్కెట్ కమిటీ నుంచి రూ.1.46 కోట్ల సెస్సు వసూలు చేయాలని రాయలసీమ మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు ఆదేశించారని తెలిపారు. మొత్తం ఏడు కమిటీల నుంచి రూ.36.18 కోట్లు వసూలు చేయాల్సి ఉందన్నారు. దిగుబడులు పూర్తి స్థాయిలో రైతులకు అందాయని, అందువల్ల ఎటువంటి ఆటంకాలు లేకుండా సెస్సు వసూలు చేస్తామని ఏడీఎం ధీమా వ్యక్తం చేశారు. ఆయా మార్కెట్ కమిటీల పరిధిలో వ్యాపారులు జీరో వ్యాపారం చేస్తే చర్యలు తీసుకుంటామని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

95.40 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి : కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని శనివారం సాయంత్రం 6గంటల సమయానికి 95.49 శాతం పూర్తిచేసినట్లు కలెక్టర్ రాజకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నంద్యాల పట్టణంలోని బొమ్మలసత్రం సమీపంలో మంచానికే పరిమితమైన బాలుడు హేమంత్‌కు, మరో లబ్ధిదారు గాజుల లక్ష్మీదేవికి కలెక్టర్ రాజకుమారి పింఛన్ అందజేశారు. డిసెంబర్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే అన్ని మండలాలలో 2,06,836 మందికి 87.49 కోట్లరూపాయల మొత్తాన్ని పంపిణీ చేసినట్లు తెలిపారు.



పెన్షన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాజకుమారి



ఎయిడ్స్ తగ్గుతోంది

- అవగాహనతోనే హెచ్‌ఐవీ దూరం
- నివారణకు కృషి చేస్తున్న అన్ని విభాగాలు
- నేడు వరల్డ్ ఎయిడ్స్ డే

కర్నూలు హాస్పిటల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): హ్యూమన్ ఇమ్యూనో డె ఫిషియెన్సీ వైరస్ (హెచ్‌ఐవీ) ప్రాణాంతకమైన వ్యాధి. మందులేని ఈ మాయాదారి రోగం ప్రపంచానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది. ప్రపంచాన్ని గడగడలాడించిన ఎయిడ్స్ క్రమంగా తగ్గుముఖం పడుతున్నది. కర్నూలు జిల్లాలో 2002లో హెచ్‌ఐవీ పాజిటివ్ శాతం 0.50 శాతం ఉన్న వ్యాప్తి 2021 నాటికి 0.33 శాతంగా ఉంది. ఎయిడ్స్ మెల్లగా తగ్గుతున్నప్పటికీ ప్రపంచంలో ఇంకా పూర్తిగా నిర్మూలన కాలేదు. దీంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ 1988 డిసెంబరు 1 నుంచి ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినంగా పాటిస్తున్నారు. ఇండియాలో మొట్టమొదటిగా 1986లో ఎయిడ్స్‌ను గుర్తించారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా ఈ ఏడాది డబ్ల్యూహెచ్‌వో "హక్కుల మార్గాన్ని అనుసరించండి.. నా ఆరోగ్యం నా హక్కు" అన్న నినాదాన్ని ఇచ్చింది.

జిల్లాలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ కింద అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఐసీటీసీ కేంద్రాలు, ఫెసిలిటీ ఇంటిగ్రేటెడ్ ఐసీటీసీలు 87, ఏఆర్‌టీ ప్లస్ కేంద్రం కర్నూలు జీజీహెచ్, ఏఆర్‌టీ కేంద్రం ఏరియా ఆసుపత్రి ఆదోని, లింక్ ఏఆర్‌టీ కేంద్రాలు-3, ప్రభుత్వ ప్రైవేటు రక్తనిధి కేంద్రాలు 14, ప్రివెన్షన్ యూనిట్లు 5, లింక్ వర్కర్ ప్రాజెక్టు చైల్డ్ ఫండ్ ఇండియా (48 గ్రామాల్లో)-1, నేస్తం పాజిటివ్ నెట్‌వర్క్-1 కేంద్రాలున్నాయి. జిల్లాలో ఏఆర్‌టీ కేంద్రాల్లో చికిత్స కోసం నమోదు చేసుకున్న వారి సంఖ్య 18,843 ఉండగా.. ఏఆర్‌టీ కేంద్రంలో మందులు వాడే వారి సంఖ్య 7485, ఏఆర్‌టీ ప్లస్ కేంద్రంలో 2వ రకపు మందులు వాడేవారి సంఖ్య 669 ఉండగా.. ఏఆర్‌టీ పెన్షన్లు తీసుకుంటున్న వారు 668 బాధితులు ఉన్నారు. 2011-12లో 59,982 మందికి పరీక్షలు చేయగా.. 2920 మంది హెచ్‌ఐవీ బాధితులు ఉన్నారు. ఇక 40,653 మంది గర్భిణులకు పరీక్షలు చేయగా.. 167 మందికి హెచ్‌ఐవీ సోకింది. 2024లో 62,107 మందికి హెచ్‌ఐవీ పరీక్షలు చేయగా.. మొత్తం 291 మంది బాధితులు ఉన్నారు.

హెచ్‌ఐవీ సోకడానికి ప్రధాన కారణాలివే

హెచ్‌ఐవీ, ఎయిడ్స్ సోకడానికి ప్రధాన కారణం అసురక్షితమైన సెక్స్ కండోమ్‌లను వినియోగించకుండా లైంగిక సంపర్కంలో పాల్గొనడం వల్ల ప్రధానంగా ఈ వ్యాధి సోకుతుంది. ఈ వైరస్ వీర్యం, యోని ద్రవాల్లో, రక్తంలో వ్యాపిస్తుంది. రక్తమార్పిడి అవయవమార్పిడీ అసురక్షితమైన వైద్య విధానాల వల్ల హెచ్‌ఐవీ సోకుతుంది. వైరస్ ఉన్న వ్యక్తి వినియోగించిన ఇంజెక్షన్లు మరొకరికి ఉపయోగించడం వల్ల కూడా వైరస్ వ్యాపిస్తుంది. తల్లి నుంచి బిడ్డకు కూడా ఈ వైరస్ సంక్రమిస్తుంది. తల్లికి ఎయిడ్స్ ఉన్నట్లయితే.. ప్రసవ సమయంలో లేదా తల్లి పాలివ్వడంతో ఈ వ్యాధి సంక్రమిస్తుంది. వ్యాధి నిర్ధారణకు హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నిర్ధారణకు కొన్ని నిర్దిష్ట పరీక్షలు చేయించుకోవాలి.

ప్రభుత్వ విభాగాల సహకారంతో

- మహిళ, శిశు సంక్షేమ శాఖ ద్వారా ఉమ్మడి జిల్లాలో మిషన్ వాత్సల్య పథకం కింద హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారు 102 మంది చిన్నారులు లబ్ధిపొందుతున్నారు.
- ఉమ్మడి జిల్లాలోని డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులతో రెడ్ రిబ్బన్ క్లబ్బులు ఏర్పాటు చేసి రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నారు.
- ఇంటెన్సిఫైడ్ హెచ్‌ఐవీ ప్రచార కార్యక్రమంలో భాగంగా నాలుగు నెలల పాటు కళాశాల విద్యార్థులకు, యువత, హెచ్‌ఐవీ సోకే ప్రమాదం ఉన్న వ్యక్తులకు సుమారు 15వేల మందికి అవగాహన కల్పించారు.
- పోలీసు, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో జిల్లాలో 102 స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహించి జిల్లాలో 31,035 యూనిట్ల రక్తం సేకరించడం ద్వారా రక్తం కొరత లేకుండా సురక్షిత రక్తమార్పిడి ద్వారా హెచ్‌ఐవీ వ్యాప్తిని అరికట్టేందుకు కృషి చేశారు.

పాజిటివ్ నెట్‌వర్క్ ద్వారా సేవలు




జిల్లా స్థాయి పాజిటివ్ నెట్‌వర్క్ ద్వారా హెచ్‌ఐవీతో జీవిస్తున్న వ్యక్తులకు నాణ్యమైన జీవితాన్ని అందించడానికి ఉమ్మడి జిల్లాలో కృషి చేస్తున్నాం. సుమారు 13వేల మందికి ఆరోగ్యకరమైన, ఇతర సేవలను, హెచ్‌ఐవీ ఒకరి నుంచి మరొకటి సోకకుండా వారి ఆరోగ్యాన్ని మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నాం. ఎవరైనా హెచ్‌ఐవీతో జీవిస్తున్న వ్యక్తులు వివక్షకు గురైతే జిల్లా న్యాయ సేవాసంస్థ ద్వారా వారికి న్యాయం జరిగేలా చూస్తున్నాం. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు అన్ని విధాలా సహకరిస్తున్నాం. - **బి. సుధారాణి, అధ్యక్షురాలు, నేస్తం జిల్లా పాజిటివ్ నెట్‌వర్క్ సంస్థ, కర్నూలు**

హెచ్‌ఐవీ పాజిటివిటీలో 7వ స్థానం



హెచ్‌ఐవీ సెంటినెల్ సర్వేలైన్ సర్వే ప్రకారం ఎయిడ్ పాజిటివిటీ కేసుల్లో జిల్లా 7వ స్థానంలో ఉంది. ఉమ్మడి జిల్లాలో ఏడాది అక్టోబరు వరకు 567 కేసులు వచ్చాయి. ఇక జిల్లాలో హెచ్‌ఐవీ మొదటి రకం మందులు వాడే వారు 7585, రెండో రకం మందులు వాడే వారు 669 మంది ఉన్నారు. ఏఆర్‌టీ పింఛన్ 668కి పింఛన్ ఇస్తు ప్రోత్సాహకాన్ని ఇస్తున్నాం. హెచ్‌ఐవీ పట్ల ప్రజలు అవగాహన పెంచుకోవాలని, రక్తమార్పిడి, కలుషిత సిరంజుల వాడకం అసురక్షితమైన సెక్స్ వల్ల ఎయిడ్స్ వస్తుంది.

- డా.ఎల్. భాస్కర్, డీఎంహెచ్‌వో



జిల్లాలో హెచ్‌ఐవీ పాజిటివ్‌ల సంఖ్య

సంవత్సరం	సాధారణ ప్రజలు- హెచ్‌ఐవీ పరీక్ష	హెచ్‌ఐవీ బాధితులు	హెచ్‌ఐవీ పరీక్షలు	గర్భిణులు హెచ్‌ఐవీ బాధితులు
2019-2020	104492	1223	97230	54
2020-2021	56169	576	86309	47
2021-2022	87865	885	102170	54
2022-2023	68182	620	83596	36
2023-2024	81882	477	80122	18
2024 (ఏప్రిల్-అక్టోబరు)	62107	291	31512	15

26 మంది సీఐలు బదిలీ

కర్నూలు క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కర్నూలు, కడప, అనంతపురం రేంజ్ పరిధిలో 26 మంది సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన సీఐల వివరాలు...

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
బీవీ విక్రమ సింహ	ఎమ్మిగనూరు	వీఆర్, కర్నూలు
బీవీ మధుసూదనరావు	సీసీఎస్-1, కర్నూలు	ఎమ్మిగనూరు
కే.శ్రీనివాస నాయక్	వీఆర్, కర్నూలు	సీసీఎస్-1 కర్నూలు
ఎస్.అస్రార్ బాషా	నంద్యాల తాలుకా	నంద్యాల ఎస్‌బీ-2,
ఆర్.ఈశ్వరయ్య	డీటీసీ, నంద్యాల	నంద్యాల యూపీఎస్
ఏ.చాన్ బాషా	వీఆర్, అన్నమయ్య	డీటీసీ, నంద్యాల
డి.రాము	వీఆర్, నంద్యాల	ఆత్మకూరు
కే.మోహన్ రెడ్డి	పీసీఆర్, నంద్యాల	ఎస్‌బీ-1, నంద్యాల
బీఆర్ కృష్ణయ్య	వీఆర్, నంద్యాల	పీసీఆర్, నంద్యాల
జి.ఓబులేసు	ఆత్మకూరు	చిన్నచౌక్, కడప
కృష్ణమరాజు నాయక్	ఒంటిమిట్ట, కడప	వీఆర్,కడప
టి.బాబు	వీఆర్, అన్నమయ్య	ఒంటిమిట్ట, కడప
వి.నాగరాజు	ఆర్‌కే వ్యాలీ, కడప	సైబర్ క్రైం, కడప
కే.ఉలసయ్య	వీఆర్, చిత్తూరు	ఆర్‌కే వ్యాలీ, కడప
యు.వెంకట కుమార్	ఎస్‌బీ-1, కడప	వీఆర్, కడప
టి.రెడ్డప్ప	వీఆర్, కడప	సెబ్-1, కడప
పి.సురేంద్రనాథ్ రెడ్డి	వీఆర్, అన్నమయ్య	సెబ్-2, కడప
జి.ఇద్రుబాషా	వీఆర్, కడప	ఏహెచ్‌టీయు, కడప
టి.నరసింహులు	ఆర్ఎస్ఏఎస్‌టీఎఫ్, అన్నమయ్య	పులివెందుల, కడప
కే.రాజారెడ్డి	బి.కొత్తకోట,అన్నమయ్య	ఎస్‌బీ-3 అన్నమయ్య
జి.జీవన్ గంగనాథ్ బాబు	పులివెందుల, కడప	బి.కొత్తకోట అన్నమయ్య
టి.మధు	వీఆర్, అన్నమయ్య	ఆర్ఎస్ఏఎస్‌టీఎఫ్, అన్నమయ్య
టీవీ సత్యనారాయణ	ఎస్‌బీ-1 అన్నమయ్య	వీఆర్, అన్నమయ్య
పి.రాజారమేష్	ఎస్‌బీ-3 అన్నమయ్య	ఎస్‌బీ-1 అన్నమయ్య
జే.శంకరయ్య	డీసీఆర్‌బీ, అన్నమయ్య	వీఆర్, అన్నమయ్య
ఎం.తులసీరాం	వీఆర్, అనంతపురం	డీసీఆర్‌బీ, అన్నమయ్య

తల్లీబిడ్డను బలిగొన్న వైద్యులు

పత్తికొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్వాకంతో తల్లీబిడ్డలు మృతి చెందారు. వివరాలు ఇలా.. పత్తికొండ పట్టణం రాజీవ్‌నగర్ కాలనీలో నివసిస్తున్న మౌలాలి తన కూతురు మౌనిక (19)ను పట్టణంలోని లక్ష్మీనగర్‌కు చెందిన మహేష్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. మౌనిక గర్భం దాల్చడంతో కాన్పు కోసం పుట్టింటికి తీసుకు వచ్చారు. శుక్రవారం ఉదయం నొప్పులు రావడంతో పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు ఆమెను కాన్పుల వార్డులో చేర్చి సెలైన్ పెట్టారు. ఆ తర్వాత మౌనికకు నొప్పులు తగ్గిపోవడంతో ప్రసవం ఇంకా ఆలస్యమయ్యేలా ఉందని, నొప్పులు వచ్చాక రావాలని చెప్పడంతో ఇంటికి వెళ్లిపోయారు. శనివారం ఉదయం 6గంటలకు నొప్పులు తీవ్రం కావడంతో కుటుంబ సభ్యులు మౌనికను మళ్లీ ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. మధ్యాహ్నం వరకు ప్రసవం అవుతుందని చెప్పిన సిబ్బంది మధ్యాహ్న సమయంలో గర్భంలో బిడ్డ పరిస్థితి బాగోలేదని, మరో ఆసుపత్రికి తీసుకెళ్లాలని చెప్పారు. దీంతో పత్తికొండ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు పరీక్షించి ఆపరేషన్ చేశారు. కొద్దిసేపటికే పుట్టిన మగశిశువు మృతి చెందింది. మౌనిక అపస్మారక స్థితికి చేరుకోవడంతో హుటాహుటిన అంబులెన్స్‌లో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ విషయంపై ప్రభుత్వాసుపత్రి డ్యూటీ డాక్టర్ వివరణ కోరగా ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఆసుపత్రిలో తమ పర్యవేక్షణలో ఉందని అన్నారు. తాము వేరే ఆసుపత్రికి తీసుకెళ్లి సిజేరియన్ చేయించుకుంటామని కుటుంబ సభ్యులే తీసుకెళ్లారని తెలిపారు.

పాత రైళ్లే.. కొత్త నెంబర్లు



మద్దికెర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే డివిజన్ గుండా ప్రయాణించే పలు రైళ్లకు కొత్త నెంబర్లతో జనవరి 1 నుంచి అమలు అవుతాయని రైల్వే అధికారులు తెలిపారు. శనివారం ఓ ప్రకటనలో విడుదల చేసిన వివరాలు ఇలా ఉన్నాయి. హిందూపురం-గుంతకల్లు రైలుకు 77213, హిందూపురం టూ గుంతకల్లు 77214, గుంతకల్లు టూ డోన్‌కు 77203, డోన్ టు గుత్తికి 77207, గుత్తి-డోన్‌కు 77206, గుంతకల్లు-రాయచూరుకు 77201, రాయచూరు-గుంతకల్లు 77202, తిరుపతి-హుబ్లీ 57401, హుబ్లీ- తిరుపతి 57402, తిరుపతి-కదిరి దేవరపల్లి 57405, కదిరి దేవరపల్లి-తిరుపతి 57406, గుంతకల్లు-తిరుపతి 57401, తిరుపతి-గుంతకల్లు 57403, చిక్జాజూర్-గుంతకల్లు 57416, గుంతకల్లు-చిక్జాజూర్ 57415, కాచిగూడ-గుంతకల్లు 57412, గుంతకల్లు-బోధన్ 57411 నెంబర్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ నెంబర్లు వచ్చే ఏడాది జనవరి నుంచి అమలువుతాయన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మంత్రాలయం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని కాచాపురంలో కర్నాటక మద్యం అమ్ముతుండగా అదే గ్రామానికి చెందిన రాఘవేంద్ర అనే వ్యక్తిని మాధవరం ఎస్ఐ విజయకుమార్ తన సిబ్బందితో దాడులు చేసి పట్టుకున్నారు. శనివారం 2 బాక్సులోని 186 కర్నాటక 90 ఎంఎల్ మద్యం టెట్రా ప్యాకెట్లును స్వాధీనం చేసుకొని వ్యక్తిని అరెస్టుచేశారు. నిందితుడ్ని ఎమ్మిగనూరు కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దాడుల్లో రామకృష్ణ, వీరేష్ పాల్గొన్నారు.

అంజలిని రిటైన్ చేసుకున్న యూపీ వారియర్స్



ఆదోని, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉమెన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో క్రికెటర్ అంజలి శర్వాణిని యూపీ వారియర్స్ రిటైన్ చేసుకుంది. ఆదోని పట్టణానికి చెందిన ఈమె గతేడాది వేలంలో యూపీ వారియర్స్ జట్టు రూ.55లక్షలకు దక్కించుకుంది. వచ్చే సీజన్ వేలం డిసెంబరు 15న నిర్వహించనుండగా, గతంలో కంటే 10% అధికంగా చెల్లించే ఒప్పందంతో అంజలిని యూపీ జట్టు రిటైన్ చేసుకుంది. దీంతో తల్లిదండ్రులు వెంకటరమణ్మ అనురాధ, గురువు పులికొండ వెంకటేష్ హర్షం వ్యక్తం చేశారు.

భోజనంపై విచారణకు ఆదేశాలు



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో రాజేంద్రప్రసాద్

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంపై విచారణ చేయాలని డీఈవో శ్యామ్యూల్ పాల్ ఆదేశించారు. శనివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'తినేస్తున్నారు' శీర్షికన ప్రచురితమైన కథనానికి డీఈవో స్పందించారు. విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఎంఈవో రాజేంద్రప్రసాద్‌ను ఆదేశించడంతో ఆయనయ ఉదయం పాఠశాలకు వెళ్లి వివరాలను సేకరించారు. శుక్రవారం పాఠశాలకు హాజరైన విద్యార్థులు, మధ్యాహ్న భోజనం తిన్న విద్యార్థుల సంఖ్య, వంట తయారీపై విచారించారు. అయితే నిర్వాహకులు ఎంతఈ వోను కూడా తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. 1,140మంది విద్యార్థులకు 170కేజీల బియ్యాన్ని వండినట్లు చూపించారు. వాస్తవానికి వంద కేజీలే వండినట్లు సమాచారం. వంట మనుషులు కూడా 11 మంది గాను ఆరుగురే ఉండగా మిగతా వారు బయటకు వెళ్లినట్లు రాశారు. వివరాలతో డీఈవోకు నివేదిక ఇస్తామని ఎంఈవో తెలిపారు.

క్యాన్సర్ నివారణ సాధ్యమే

- ప్రాథమిక దశలో వైద్యం చేయించుకోవాలి
- రూ.30 కోట్లతో అత్యాధునిక పరికరాలు
- కలెక్టర్ పి. రంజిత్‌బాషా



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు రాజ్‌విహార్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ నివారణ సాధ్యమని, వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించేలా ప్రజల్లో అవగాహన, చైతన్యం పెంచాలని కలెక్టర్ పి. రంజిత్‌బాషా అన్నారు. శనివారం వైద్యకళాశాలలోని న్యూ లెక్చరర్స్ గ్యాలరీలో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ప్రివెంటివ్ ఆంకాలజీ, ప్యాలియేటివ్ కేర్ అన్న అంశంపై జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ జిల్లాలో ఏర్పాటు కావడం చాలా గర్వకారణమని, ఈ సదస్సు వల్ల క్యాన్సర్ నివారణ, చికిత్స విధానాలు, నూతన ఆవిష్కరణలు తెలియజేసే గొప్ప వేదికగా లభించిందన్నారు. క్యాన్సర్‌పై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయడానికి ఈ కార్యక్రమం ఎంతో ప్రయోజకారిగా ఉంటుందన్నారు. వైద్య విద్యార్థులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల క్యాన్సర్ వ్యాధి నివారణకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నాయని, ప్రారంభ దశలోనే గుర్తించి, నివారించేందుకు ఇంటింటికి వెళ్లి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా సర్జరీలు, కీమోథెరపీ వైద్య సేవలను అందించేందుకు సుమారు రూ.30 కోట్ల వ్యయంతో వైద్య పరికరాలను ఏర్పాటు చేశామని, ఇవి బాధిత ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని, ఇన్‌స్టిట్యూట్ నిర్వహణ, అభివృద్ధికి సంబంధించి తన దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ శ్రీకృష్ణ ప్రకాష్ మాట్లాడుతూ బాధితులకు మెరుగైన సేవలు అందుతాయని, నగర శివారులోని ట్రిపుల్ ఐటీ డీఎంతో అవగాహన ఒప్పందం కుదిరిందని, వారి సహకారంతో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ద్వారా మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించేలా కృషి చేస్తామన్నారు. ట్రిపుల్ ఐటీ రిజిస్ట్రార్ కే. గురుమూర్తి మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో సేద్యం చేస్తే ఆనేక రకాల వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని అన్నారు. కెనడా నుంచి వచ్చిన టూ వరల్డ్ క్యాన్సర్ కో ఆర్డినేషన్ డైరెక్టర్, డా. సైమన్ సట్‌క్లిఫ్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తించటం వల్ల నివారణ సాధ్యమని, నిరంతర ఆరోగ్య పరీక్షలు, జాగ్రత్తలతో మెరుగైన జీవన కాలాన్ని పెంచుకోవచ్చని అన్నారు. సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా జిల్లాలో క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ అన్ని హంగులతో ఏర్పాటైందని అన్నారు. ఈ సందర్భంగా అతిథులను కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల పిన్సిపాల్ డా. చిట్టినర్సమ్మ, టూవరల్డ్ క్యాన్సర్ కొలాబరేషన్ ప్రతినిధులు డా. గిల్లియన్ ఫైల్స్, డా. మేరియాన్ మెర్గాన్, డా. గాయత్రి పలాట్, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



పాల్గొన్న వైద్యులు, విద్యార్థులు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి జిల్లాలో శనివారం రహదారులకు రక్తం అంటుకున్నది. వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. కర్నూలు జిల్లాలో ఇద్దరు, నంద్యాల జిల్లాలో ఒకరు చనిపోయారు. వారి కుటుంబాలు కన్నీటి సాగరంలో మునిగిపోయాయి.



రంగస్వామి (ఫైల్)



నుజ్జునుజ్జయిన మోటార్ బైక్

నందవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగతి గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం కారు- మోటర్ బైకును ఢీకొన్న ప్రమాదంలో బలిజ పెద్ద రంగస్వామి(25) అనే యువకుడు మృతి చెందాడు. మంత్రాలయం మండలంలోని సుంకేసుల గ్రామానికి చెందిన పెద్దరంగస్వామి ఎమ్మిగనూరులో తమ పని ముగించుకుని మంత్రాలయం మీదగా తమ స్వగ్రామమైన సుంకేసులకు బయలుదేరాడు. మార్గమధ్యంలో ముగతి సమీపంలో మంత్రాలయం నుంచి ఇన్‌వో కారు ఎమ్మిగనూరు వైపు అతి వేగంగా వస్తు బైక్‌ను ఢీ కొట్టింది. రంగస్వామికి తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వెళుతున్న ముగతి టీడీపీ నాయకుడు తులసీరామ్ యాదవ్, డ్రైవర్ వలి తదితరులు స్పందించి వెంటనే అంబులెన్స్‌లో ఎక్కించి ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే మార్గమధ్యంలోనే యువకుడు మృతి చెందాడు. ఢీకొట్టిన కారు కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్ వాసులదని, వారు మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనం ముగించుకుని తిరిగి వెళుతుండగా ఈ సంఘటన జరిగిందని తెలిపారు. వెంటనే డీఎస్పీ ఉపేంద్రబాబు, ఏఎస్ఐ శ్రీనివాసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్యాలకుర్తి యూసుఫ్..

గోనెగండ్ల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండలం వేముగోడు గ్రామం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్యాలకుర్తికి చెందిన యూసుఫ్ (52) మృతి చెందాడు. గ్రామానికి చెందిన యూసుఫ్ శనివారంఉదయం తన ద్విచక్రవాహనంలో ఎమ్మిగనూరుకు బయలు దేరాడు. ఎమ్మిగనూరు పట్టణంలో మృతి చెందిన తన సమీప బంధువు అంత్యక్రియలకు వెళుతూ వేముగోడు గ్రామం శివార్ల దగ్గరకు రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడిపోయింది. తీవ్రంగా గాయపడటంతో చుట్టపక్కల పొలాల వారు అక్కడికి వచ్చేలోగా మృతి చెందాడు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

కోవెలకుంట్లలో...

కోవెలకుంట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం ఉదయం కోవెలకుంట్ల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో చోటు చేసుకుంది. ఎస్ఐ వివరాల మేరకు.. కోవెలకుంట్ల పట్టణంలోని రంగరాజుపేటకు చెందిన గణపతి అలియాస్ రమణారావు (43) అనే వ్యక్తి ఆర్టీసీ బస్టాండులో మెకానికల్‌గా పని చేస్తుండేవాడు. ఉదయం ఆర్టీసీ బస్సును డ్రైవరు అశోక్ రివర్స్ పోవడంతో బస్సు వెనుక కింద చక్రాల కింద రమణారావు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిపిన వెంటనే ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గుంతలోకి దూసుకెళ్లిన కారు



ఆలూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హులేబీడు సమీపంలో శనివారం సాయంత్రం కారు అదుతప్పి గుంతలోకి దూసుకెళ్లింది. కాగా బెలూన్లు తెరచుకోవడంతో లోపల ఉన్నవారికి ఏమీ కాలేదు. శబ్దం రావడంతో గ్రామస్తులు చేరుకొని కారులో ఉన్న ఇరువురిని బయటకు తీశారు. కారులో ఉన్నవారు ఎమ్మిగనూరు నుంచి ఆలూరుకు వెళుతున్నట్లు సమాచారం.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆలూరు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో గాయపడిన హత్తిబెళగల్ గ్రామానికి చెందిన సద్దాం హుస్సేన్ (28) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. నాలుగు రోజుల క్రితం ఆలూరు నుంచి హత్తిబెళగల్‌కు బైక్‌పై ముళ్ళకంపలో పడ్డాడు. చికిత్స నిమిత్తం బళ్లారి ఆసుపత్రికి అనంతరం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక మృతి చెందాడు.

మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు



మలుపులను పరిశీలిస్తున్న సీఐ, ఎంవీఐ, ఆర్అండ్‌బీ డీఈ

గోనెగండ్ల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నుంచి కోడుమూరు వరకు ఉన్న మలుపులను గుర్తించి అటు దగ్గర గా ఉన్న ముళ్ల పొదలను గుర్తించి చర్యలు తీసుకుంటున్నట్లుసీఐ గంగాధర్, ఆదోని మోటర్ వెయికిల్ ఇన్‌స్పెక్టర్ శిరీష దీప్తి, కోడుమూరు ఆర్అండ్‌బీ డీఈ రవిచంద్ర అన్నారు. శనివారం గోనెగండ్ల మండలంలోని పలు గ్రామాల దగ్గర ఉన్న మలుపులను వారు గుర్తించారు. వారు మట్లాడుతూ ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ హైవే రోడ్డు పక్కన ఉన్న ప్రమాదకర ప్రదేశాలను మలుపులను గుర్తించి ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయనున్నామన్నారు. మలుపుల దగ్గర మలుపులు, ముళ్ల పొదలు రోడ్డుకు అడ్డంగా ఉన్న చోట అతి వేగంగా వెళ్ల కూడదని వారు అన్నారు. ఈ విషయాన్ని గుర్తించి వాహనాలను నడపాలి వారు కోరారు.

దాడి ఘటనలో కేసు నమోదు

పెద్దకడబూరు, నవంబరు (ఆంధ్రజ్యోతి)30: వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో 8 మందిపై కేసు నమోదు అయినట్లు ఎస్ఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల మేరకు హనుమాపురం గ్రామానికి చెందిన కోతి పెద్దయ్య, గొల్ల బసప్పతోపాటు బైక్‌పై పొలానికి వెళ్లాడు. అదే గ్రామానికి చెందిన 8 మంది బైక్ ను అడ్డుకొని పెద్దయ్యపై దాడి చేసారు. దాడిలో ఆయన గాయాలు కావడంతో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పొలంలోని పైపుల విషయంలో తలెత్తిన వివాదం ఈ ఘటనకు దారి తీసినట్లు తెలుస్తోంది.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

మంత్రాలయం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని చెట్నహళ్లి గ్రామానికి చెం దిన బాలిక అదృశ్యమైనట్లు మంత్రాలయం ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు. శుక్రవారం రాత్రి బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. బాలిక అదృశ్యం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మంత్రాలయం మఠం ప్రాంగణంలోని భక్తుల రద్దీ

మంత్రాలయంలో భక్తుల కోలాహలం

మంత్రాలయం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం కోలాహలంగా మారింది. శని, ఆదివారం సెలవు కావడం, కార్తీక మాసం చివరి రోజు కావడంతో దక్షిణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. మఠం అతిథి గృహాలు, ప్రైవేట్ లాడ్జీలు భక్తులతో నిండిపోయాయి. అద్దె రూములు దొరకక మధ్వమార్గ్ కారిడార్ ముందే భక్తులు బసచేశారు. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది.



మంత్రాలయానికి భారీగా తరలివచ్చిన భక్తులు

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్తీకమాసం ఆఖరి రోజు కావడంతో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య స్వర్ణ రథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఉత్సవ మూర్తికి ఊంజల సేవ నిర్వహించారు.

రాఘవేంద్రుని సన్నిధిలో ఎస్పీ బిందుమాధవ్

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్నూలు ఎస్పీ బిందుమాధవ్ కుటుంబ సమేతంగా శనివారం సాయంత్రం మంత్రాలయం ు వచ్చారు. ఈయనకు మఠం జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహ మూర్తి ఘనంగా స్వాగతం పలికారు. ఎస్పీ గ్రామదేవత మంచాలమ్మను, రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని విశేష పూజలు చేశారు. మఠం పండితులు శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.



శ్రీమఠంలో ప్రదక్షిణలు చేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

వైభవంగా పద్మనాభతీర్థుల మధ్యారాధన

వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్ర స్వామి పరమ గురువులైన పద్మనాభతీర్థుల బృందావనానికి బంగారు నాణేలతో అభిషేకం చేశారు. శనివారం నవబృందావనంలో వెలసిన పద్మనాభతీర్థుల మధ్యారాధనలో భాగంగా మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు తెల్లవారుజాము నుంచే విశేష పంచామృతాభిషేకం నిర్వహించి బంగారు, వెండి, పట్టువస్త్రాలు, బెంగళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. బంగారు నాణేలతో బృందావనానికి అభిషేకం చేశారు. మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు సంస్థాన పూజ చేసి మహా మంగళహారతులు ఇచ్చారు. పీఠాధిపతి భక్తులకు పద్మనాభ తీర్థుల ఉద్దేశించి ప్రవచనాలు చేసి భక్తులకు శేష వస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశాచార్, వాదిరాజాచార్, ద్వారపాలక అనంతస్వామి, సంజీవ కులకర్ణి, పవనాచార్, వరదేంద్రాచార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో నటకిరీటి రాజేంద్రప్రసాద్

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

శ్రీశైలం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మల్లికార్జునస్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను సినీ నటుడు రాజేంద్రప్రసాద్ శనివారం దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనానికి వచ్చిన రాజేంద్రప్రసాద్‌కు అధికారులు స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి జి. స్వాములుకు అందజేశారు. దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు. ఇదిలా ఉండగా శ్రీశైలం దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధనలో శనివారం కళాకారుల సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. హైదరాబాదుకు చెందిన ఎస్.విశ్వశాంతి బృందం సంప్రదాయ నృత్య ప్రదర్శనతో అలరించారు.



విరాళాన్ని ఏఈవోకు అందజేస్తున్న సినీ నటుడు రాజేంద్ర ప్రసాద్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే





వెంకాయపల్లె, శాంతినగర్‌లో పింఛన్లు పంపిణీ చేస్తున్న కోడుమూరు, పాణ్యం ఎమ్మెల్యేలు దస్తగిరి, గౌరు చరిత, గూడూరు మండలం బూడిదపాడులో..

కర్నూలు రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. కర్నూలు మండలం వెంకాయపల్లె గ్రామంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ ఇవ్వాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. వైసీపీ హయాంలో పేదలకు తీవ్ర అన్యాయం చేసిందని ఆయన ఆరోపించారు. వితంతువులు, వికలాంగులు, వృద్ధులకు టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ డబ్బులను పెంచిందన్నారు. కార్యక్రమంలో కర్నూలు మండల ఎంపీడీవో రఘునాథ్, ఈవోఆర్డీ అనూ రాధ, పంచాయతీ కార్యదర్శి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కల్లూరు: టీడీపీ కూటమి ప్రభుత్వంలో అవ్వాతాతలకు భరోసా ఉంటుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శనివారం నగరంలోని 21వ వార్డు శాంతినగర్‌లో ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ కర్నూలు జిల్లాకు హైకోర్టు బెంచ్‌ను ఇచ్చి ప్రజల చిరకాల కోరికను నేరవేర్చిన ఘనతా సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కార్యక్ర మంలో కర్నూలు మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, రాఘవేంద్ర, వెంకటరెడ్డి, పల్లె రఘునాథ్‌రెడ్డి, విశ్వనాథ్ పాల్గొన్నారు.

● సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ: ప్రజా ఆరోగ్యానికి టీడీపీ కూట మి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. శనివారం తన స్వగృహంలో నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మతో కలిసి గౌరు దంపతులు పాణ్యంకు చెందిన ఎర్రం నాగన్నకు రూ.35,800 చెక్కును పంపిణీ చేశారు.

● కల్లూరు మండలం కె.మార్కాపురంలో ఏపీ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్, టీడీపీ మండల కన్వీనర్ డి.రామాంజనేయులు శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీలోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు.

గూడూరు: పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్షుడు జె సురేష్ అన్నారు. శనివారం గూడూరు మండలం బూడిదపాడు గ్రామంలో లబ్ధిదారులకు టీడీపీ మండల అధ్యక్షుడు జె సురేష్ పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు గోపాల్ రెడ్డి, బంగారు శ్రీనివాసులు, ఏసన్న పాల్గొన్నారు.

● ఆర్.కానాపురంలో.. గూడూరు మండలం ఆర్.కానాపురం గ్రామం లో తెలుగు యువత మండల అధ్యక్షుడు సుమన్ బాబు, సర్పంచ్ మునిస్వామి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

భూములను కాపాడాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్, దేవదాయ భూములు ఆక్రమణలకు గురి కాకుండా కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వక్ఫ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ టీములు ఏర్పాటు చేసి, ఆక్రమణలకు సంబంధించి ప్రస్తుతం ఉన్న పరిస్థితి ఏంటీ అని రికార్డు చేసి నివేదికను పది రోజుల్లోపు తనకు సమర్పించాలని ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్డీవోలను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో వక్ఫ్, దేవాదాయ భూములపై దృష్టి సారించాలని మున్సిపల్ కమి షనర్లను ఆదేశించారు. వక్ఫ్, దేవదాయ శాఖ భూములకు సంబంధించిన సర్వే నెంబర్ల పూర్తి వివరాలను మండల, డివిజన్ వారీగా తయారు చేసిన సబ్ కలెక్టర్, ఆర్డీవోలను అందజేయాలని డీఆర్వోను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, కర్నూలు నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు, మైనార్టీ సంక్షేమ అధి కారి సబీహా పర్వీన్, ఆదోని సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాన్ని వేగవంతం చేయండి



నన్నూరులో లేవుట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఓర్వకల్లు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ సీఈ జయరామ్ ఆచారి లబ్ధిదారులకు సూచించారు. శనివారం మండలంలోని నన్నూరు గ్రామ సమీపాన ఉన్న లే అవుట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు మార్చిలోపు గృహ నిర్మాణాలను పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఈ కృష్ణమూర్తి, ఏఈ రామయ్య, వర్క్ ఇన్స్‌పెక్టర్లు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా హౌసింగ్ శాఖలో పనిచేస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని ఒప్పంద ఉద్యోగుల సంఘం ప్రతినిధి హనుమన్న కోరారు. శనివారం హౌసింగ్ సీఈ జయరామాచారి నన్నూరు, పందిపాడులోని లే అవుట్ పనుల పరిశీలన అనంతరం గృహనిర్మాణ శాఖ కార్యాలయానికి వచ్చారు. ఈసందర్భంగా జయరామాచారికి ఉద్యోగులు వినతిపత్రం సమర్పించారు. రామునాయక్, నాగేష్, యాసిన్, వెంకటేష్, కిరణ్ పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త గురజాడ



గురజాడ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు

కర్నూలు అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని చైతన్య వంతం చేస్తూ రచనలు చేసిన గురజాడ గొప్ప సంఘ సంస్కర్త అని ప్రిన్సిపాల్ జే.హేమంత్ అన్నారు. ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో గురజాడ అప్పారావు 109వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వ్యసరచన పోటీల్లో గెలు పొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తెలుగుశాఖ అధ్యక్షురాలు వింధ్యావాసినీ దేవి, పకృన్నిసా బేగం, జి.శ్రీనివాస్, మురళీధర్, సోమశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

● సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ వీవీవీఎస్ కుమార్ పూలమాల వేసి నివాళి అర్పించారు. తెలుగుశాఖ అధ్యక్షురాలు ఎం. ఫమీద బేగం గురజాడ గేయాలు, ఉద్యమాల గురించి వివరించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలను అరికట్టాలి: డీఎస్పీ

కర్నూలు అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలను అరికట్టాలని డీఎస్పీ మహబూబ్ బాషా అన్నారు. శనివారం కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సదస్సులో సీఐ వేణుగోపాల్, పీపీటీ ప్రదర్శన ద్వారా సైబర్ నేరాల నుంచి ఎలా తప్పించుకోవాలనే దానిపై వివరించారు. విద్యార్థుల సందేహాలకు సైబర్ క్రైం పోలీస్ బృందం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైకాలజీ విభాగం అధ్యక్షురాలు విజయలక్ష్మి, వైఎస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరెడ్డి, పార్వతి దేవి, మణికంఠ, అధ్యాపకురాలు స్రవంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అపోహలు వీడాలి: ప్రిన్సిపాల్

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలు అపోహలు వీడాలని కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నర్సమ్మ అన్నారు. శనివారం కళాశాలలోని ఓల్డ్ సీఎ ల్‌జీలో అసుపత్రి సూపరింటెండెంట్, ఏఆర్‌టీ సెంటర్ నోడల్ ఆఫీసర్ దావాం శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చిట్టి నర్సమ్మ మాట్లాడుతూ ఎయిడ్స్‌కు మందులు, చికిత్స విధానాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో భాస్కర్, సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ వ్యాధిని తొలి దశలోనే గుర్తించి చికిత్స అందించాలన్నారు. వైద్యులు కుసుమ బాయి, మల్లికార్జున, కుముద పాల్గొన్నారు.

నేడు కుటుంబ సమ్మేళనం

కర్నూలు కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య భారతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు కుటుంబ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంస్థ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పి. మోక్షేశ్వరుడు, బి.సత్యనారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని వెంకటరమణ కాలనీలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, రీజనల్ డైరెక్టర్ డాక్టర్ బి. రామగిడ్డయ్య, రాష్ట్ర కుటుంబ ప్రబోధన ప్రాంత ప్రముఖ్ పుట్టా శేషు, డాక్టర్ డి.ప్రభాకర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

రాయపాటి శ్రీనివాస్‌కు అవార్డు



కర్నూలు కల్చరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ నిర్వాహకుడు, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాస్‌కు ఉత్తమ పిలాంత్రోపిస్టు అవార్డు లభిం చింది. చండీఘర్‌లోని ఏషియన్ ప్రేయర్ అండ్ హీలింగ్ స్టేషన్ ఇం డియా అనే సంస్థ ఏటా సామాజిక సేవా కార్యక్రమాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న వారికి ఈ అవార్డు అందజేస్తోంది. కాగా ఈ ఏడాదికి రాయ పాటి శ్రీనివాస్ లయన్స్ క్లబ్, నైస్ యూత్ సంస్థల ద్వారా చేపట్టిన విద్య, ఉపాధి, సమాజిక సేవ, న్యాయ విజ్ఞాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, సామాజిక సమస్యలపై అవగాహన కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డు ప్రకటించి, అంతర్జాలం ద్వారా శనివారం అందజేసింది. ఈ సందర్భంగా రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ అవార్డు ఎంపిక మరింత సేవాభావ నిరతిని పెంపొందించిందన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

కల్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1, 2 తేదీల్లో నగరంలో జరిగే సీపీఎం మూడో మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం నగర కార్యదర్శి టీ.రాముడు, కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్. సాయిబాబా పిలుపునిచ్చారు. శనివారం స్థానిక చెన్నమ్మసర్కిల్ సూర్య నారాయణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. డిసెంబరు 1న కార్మిక కర్షక భవన్ పక్కన ఉన్న ఎస్ఎస్ ఫంక్షన్‌హాల్లో డిసెంబరు 2న సాయంత్రం చెన్నమ్మసర్కిల్ కూడలిలో బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రేపు గుర్రపుశాల అంకయ్యకు పురస్కారం

కర్నూలు కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన ప్రముఖ పౌరాణిక పద్యనాటక రంగ నటుడు, విశ్రాంత ఎస్ఐ గుర్రపు శాల అంకయ్యకు పశ్చిమ గోదావరి జిల్లా తణుకులోని షణ్ముఖి ఆంజనేయరాజు కళాపీఠం పురస్కారం లభించింది. సోమవారం తణుకులోని సురాజ్య భవన్‌లో ప్రఖ్యాత నటుడు షణ్ముఖి ఆంజనేయరాజు 96వ జయంతి సందర్భంగా ఈ పురస్కారం అందజేయనున్నారు.

ఆధార్ నమోదు వేగవంతం చేయాలి

సి.బెళగల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆధార్ నమోదును వేగవంతం చేయాలని ఎంఈవో జ్యోతి ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు జరిగిన సమావేశంలో ఎంఈవో మాట్లాడారు.

సైబర్ ఉచ్చులో పడొద్దు

సి.బెళగల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని ఎస్ఐ తిమ్మారెడ్డి అన్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ తిమ్మారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు ఆన్‌లైన్‌లో జరిగే మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

ప్రజలంతా కలిసిమెలసి జీవించాలి: గ్రామాల్లోని ప్రజలంతా కలిసి మెలసి జీవించాలని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఇనగండ్ల గ్రామంలో సర్పంచ్ ఇమ్మానేలు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం అవరణలో గ్రామస్థులతో తహసీల్దార్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ తిమ్మారెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో ప్రతి ఒక్కరూ సోదర భావంతో మెలగాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తం, వీఆర్వో రామ్మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ తిమ్మలమ్మ పాల్గొన్నారు.

రేపు ఐటీపై క్విజ్ పోటీలు

కర్నూలు కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, నైస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కంప్యూటర్ ఐటీపై క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ప్రతినిధి రాయపాటి శ్రీనివాస్ తెలిపారు. 14-17 ఏళ్ల మధ్య వారు ఈ పోటీలకు అర్హులని, ఈ పోటీలు నగరంలోని వెంకట రమణ కాలనీలోని నైస్ కంప్యూటర్స్ శిక్షణ కేంద్రంలో 2న ఉదయం 11 గంటలకు ఉంటాయని, ఆసక్తిగల వారు తమ పేర్లు శిక్షణ కేంద్రంలో నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.



కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

అమ్మవారిశాలలో లక్ష దీపోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరం లోని పూల బజార్‌లో ఉన్న అమ్మవారి శాలలో శనివారం కార్తీకమాస ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు లక్షదీపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా సంతోష్‌నగర్, బళ్లారి రోడ్ సబ్‌స్టేషన్ పరిధిలోని కాలనీల్లో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు డివి జన్ ఈఈ టి. శేషాద్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కరెంట్ కోత ఉంటుందని ఏడీఈ తెలిపారు.

ఎస్సీ బాలికల హాస్టల్ తనిఖీ

కల్లూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలం ఉలిందకొండ ఎస్సీ బాలికల హాస్టల్‌ను ఎంపీడీఓ జి.నాగేశాచలరెడ్డి శనివారం తనిఖీ చేశారు. కలెక్టర్ ఆదేశాలతో హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులకు అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో మెనూ వివరాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఉలిందకొండ 1, 2 సచివాలయాలకు వెళ్లి హౌస్ హోల్డ్ సర్వే రిపోర్టులను పరిశీలించారు. ఆయన వెంట ఈవోఆర్డీ ఉన్నారు.

దుకాణాల వివరాలివ్వండి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిధిలో వాణిజ్య పన్నుల శాఖ నుంచి వ్యాపారం కోసం రిజిస్ట్రేషన్ తీసుకున్న వ్యాపార దుకాణాల వివరాలు ఇవ్వాలని కమిషనర్ ఎస్. రవీంద్రబాబు ఆ శాఖ డిప్యూటీ కమిషనర్‌కు లేఖ రాశారు. వ్యాపారం కోసం రిజిస్ట్రేషన్ తీసుకున్న వారందరికీ ట్రేడ్ లైసెన్సులు జారీ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు లేఖలో పేర్కొన్నారు. అనంతపురం రీజినల్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాల మేరకు నగరంలో ఎన్ని వ్యాపార దుకాణాలు ఉన్నాయో వివరాలు పంపాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

గూడూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం పెంచికలపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభకనబర్చినట్లు ప్రధానోపాధ్యాయురాలు సాయిలీలా, వ్యాయామ ఉపాధ్యాయుడు నిక్సన్‌బాబు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ శ్రీకాకుళంలో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-17 లాంగ్ జంప్ విభాగంలో పెంచికలపాడు ఉన్నత పాఠశాల విద్యార్థి శంకర్ ప్రతిభను కనబరిచారు. అలాగే విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీల్లో అండర్-14 రోడ్ రైడ్ సైక్లింగ్ విభాగంలో లోకేశ్, అండర్-17 రోడ్ రైడ్ సైక్లింగ్ విభాగంలో జమీలాబీ, అండర్-17 ట్రాక్ రైడ్ విభాగంలో షాహిద్ ప్రతిభను కనబరిచి పోటీల్లో గెలుపొందినట్లు తెలిపారు. హెచ్ఎం సాయిలీలా, వ్యాయామ ఉపాధ్యాయుడు నిక్సన్‌బాబు విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

రేపు రాష్ట్ర స్థాయి భజన పోటీలు

కోడుమూరు రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటగిరి గిడ్డాంజనేయస్వామి ఆలయంలో కార్తీక అమావాస్య పురస్కరించుకుని ఆదివారం రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈపోటీలకు ఉమ్మడి తెలు గు రాష్ట్రాల నుంచి భజన బృందాలు హాజరవుతారని, వివరాలకు 939 03 55039, 96760 69895 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

కర్నూలు అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీ కే నాయక్ అన్నారు. శనివారం రాయలసీమ యూని వర్సిటీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పచ్చ దనం, పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిం చారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకో వాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు, వెంకటరత్నం, విజయుడు, నాగచంద్రుడు, శివప్ర సాదరెడ్డి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

పంచాయతీరాజ్ ఏఈ రవిమోహన్‌రెడ్డి



కల్లూరు, నవంబరు 30 (ఆంధ్ర జ్యోతి): గ్రామీణ రోడ్ల అభివృద్ధికి టీడీపీ కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని పంచాయతీరాజ్ శాఖ కల్లూరు మండల ఏఈ జి.రవిమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: కల్లూరు మండలానికి ఎన్ని సీసీరోడ్డు పనులు మంజూరయ్యాయి.

జవాబు: మండలంలో 10 గ్రామాల్లో 34 పనులు మంజూరయ్యాయి. రూ.1.89 కోట్లతో అయా గ్రామాల్లో సీసీరోడ్ల పనులు ప్రారంభించాం.

ప్రశ్న: ఇప్పటికి ఎన్ని గ్రామాల్లో పనులు పూర్తి చేశారు.

జవాబు: మండలంలో ఇప్పటి వరకు 27 పనులు పూర్తి చేశాం. పర్ల, తడకనపల్లె, (వామసముద్రం, ఓబులాపురం తాండ), ఉలిందకొండ (ఎర్ర కత్వ, కేపీ తాండ, యాపర్లపాడు), దొడ్డిపాడు, చిన్నటేకూరు, చెట్లమల్లాపురం, నాయకల్లు, కొంగనపాడు, చిన్నకొట్టాల, సల్కాపురం గ్రామాల్లో పనులు పూర్తి చేశాం. దాదాపు 3053 మీటర్ల మేర సీసీ రోడ్డు పనులు పూర్తి చేశాం. మిగిలిన గ్రామాల్లో డిసెంబరు 15 లోపు పనులు పూర్తి చేస్తాం.

ప్రశ్న: పనులను పర్యవేక్షిస్తున్నారా?

జవాబు: ప్రతి గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఇంజనీరింగ్ అసిస్టెంట్లు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఆపై పంచాయతీరాజ్ ఏఈ, డీఈ ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తున్నారు.

ప్రశ్న: నాణ్యత పాటిస్తున్నారా?

జవాబు: గ్రామాల్లో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణలు పాటిస్తున్నాం. నాణ్యత విషయంలో రాజీ పడబోం.

ప్రశ్న: పూర్తైన పనులకు నిధులు విడుదల అయ్యాయా?

జవాబు: రాష్ట్ర ప్రభుత్వం పనులు పూర్తైన బిల్లులకు చెల్లింపులు సకాలంలో ఇస్తున్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు పూర్తి చేసి బిల్లు పెట్టిన వెంటనే 10 పనులకు బిల్లులు పడ్డాయి. ఈవిషయంలో ప్రభుత్వం రాజీ పడటం లేదు.

క్రీడలతో వ్యక్తిత్వ వికాసం



క్రీడా జ్యోతితో డీఎస్పీ మహబూబ్ బాషా

కల్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు దోహదపడతాయని స్పెషల్ పోలీస్ డీఎస్పీ మహబూబ్‌బాషా, జిల్లా క్రీడా డెవలప్‌మెంట్ అధికారి భూపతిరావు అన్నారు. శనివారం పాఠశాల ప్రిన్సిపాల్ జోసెఫ్ డెవిడ్, ప్రధాన సలహాదారు లక్ష్మీనాయర్ పర్యవేక్షణలో కర్నూలులోని ఎడిఫై వరల్డ్ స్కూల్ నిర్వహించిన క్రీడా దినోత్సవానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ బహుకరించారు. పాఠశాల డైరెక్టర్లు డాక్టర్ మనోజ్, సతీష్, గాంధీరెడ్డి, జీవన్, సాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు జిల్లా క్రీడాకారులు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కావలిలో డిసెంబరు 1న జరిగే రెండో రాష్ట్ర స్థాయి రగ్బీ మినీ సబ్ జూని యర్ అండర్-12 చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే కర్నూలు జిల్లా జట్టును జిల్లా సంఘం కార్యదర్శి రామాంజనేయులు ప్రకటించారు. ఈ సందర్భంగా డీఎస్ఏ స్టేడియంలో శనివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయ పాల్గొని పతకాలతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. స్పోర్ట్స్ ప్రమోటర్ జి.శ్రీధర్ రెడ్డి, రగ్బీ ప్రతినిధులు మహబూబ్ సుభాని, రమ్య, సుప్రియ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని న్యాయవాది స్పోర్ట్స్ ప్రమోటర్ జి.శ్రీధర్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి సీనియర్ మహిళల విభాగంలో నిర్వహించిన షూటింగ్ బాల్ పోటీల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయవాది క్రీడకా రులను పరిచయం చేసుకున్నారు. జిల్లా సీనియర్ మహిళల షూటింగ్ బాల్ పోటీల్లో విజేతగా డా.బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళల జూనియర్ కళాశాల(పత్తికొండ), ద్వితీయ స్థానంలో బాల భారతి (ఓర్వకల్లు), తృతీయ స్థానంలో, కర్నూలు గుడ్‌షప్పర్డ్ పాఠశాల నిలిచాయని కార్యదర్శి నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రామాంజ నేయులు, ప్రధాన కార్యదర్శి పరుశురాముడు, రాఘవేంద్ర, కిరణ్ కుమార్, సుభాన్ బాషా పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు

తుగ్గలి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగనాయునదొడ్డి నుంచి గౌతమ్ మహాముని కొండలవరకు 2 కి.మీల రహదారి గుంతలను సర్పంచ్ చౌడప్ప, టీడీపీ నాయకులు ప్రతాప్ యాదవ్ శనివారం గరుసు వేచ్చి పూడ్చారు. వెంకటేశ్, చిన్నపులికొండ, కౌలుట్లమ్మ, రామారావు, వీరేంద్ర తదితరులు ఉన్నారు.

బీసీ కార్పొరేషన్ జీఎంతో భేటీ



జీఎంతో మాట్లాడుతున్న సావిత్రి

ఆదోని టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రజక వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి శనివారం విజయవాడలో బీసీ కార్పొరేషన్ జీఎం భీమ్ శంక ర్‌తో భేటీ అయ్యారు. రజకులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. జిల్లా వారీగా పర్యటించి, రజకుల సమస్యలు తెలుకొని, పరిష్కారానికి పూర్తిస్థాయిలో ప్రయత్నిస్తానని అన్నారు.

సమాజంలో అందరూ సమానులే

- సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య



పత్తికొండలో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట్రామయ్య

పత్తికొండ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అందరూ సమానమేనని పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య పేర్కొన్నారు. శనివారం మండలంలోని జూటూరులో తహసీల్దార్ రమేష్ అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి రాజ్యాంగంలో ప్రత్యేక చట్టాలు, హక్కులు కల్పించారన్నారు. పౌరహక్కులకు ఎవరూ భంగం కలిగించవద్దన్నారు. దళితులపై వివక్ష చూపవద్దని, సమస్యలు తలెత్తితే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సైబర్ నేరాలపట్ల జాగ్రత్త వహించాల న్నారు. తల్లిదండ్రులు పిల్లలను బాగా చది వించాలన్నారు. సైబర్ నేరాలపై పోలీసు శాఖ ప్రచురించిన కరపత్రాలను విడుదల చేశారు. పత్తికొండ సీఐ జయన్న, ఆర్ఐ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ ఈశ్వరప్ప, ఎంపీటీసీ మెంబర్ రంగమ్మ, వీఆర్వో వాసు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్షణికావేశంలో తప్పులు చేయొద్దు

తుగ్గలి: క్షణికావేశంలో తప్పులు చేయొద్దని, సమస్యలుంటే పెద్దలతో చర్చించి పరిష్కరించుకోవాలని పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య సూచించారు. శనివారం మండలం లోని శభాష్‌పురంలో కార్డెన్‌సెర్చ్ చేశారు. చర్చలతో సమస్య పరిష్కారం కాకపోతే పోలీసుల దృష్టికి తేలన్నారు. యువత మత్తుపదార్థాలు, మద్యానికి బానిసలు కావొద్దని, జూదం జోలికి పోవద్దన్నారు. సీఐలు పులిశేఖర్, జయన్న, మస్తాన్‌వలి, ఎస్ఐలు జయశేఖర్‌గౌడు, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

చంద్రబాబుకు రుణపడి ఉంటాం

ఆదోని రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే ఏ రాష్ట్రంలో లేనివిధంగా రూ.6వేల పింఛన్ ఇస్తానన్న హామీ నెరవేర్చిన సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటామని దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు దుగ్గప్ప పేర్కొన్నారు. శనివారం మాట్లాడుతూ డిసెంబరు 3న మండల కార్యాలయ ఆవరణంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఉపాధ్యక్షుడు హనుమంతరెడ్డి, వీరాంజనేయులు, మల్లికార్జున పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సంక్షేమ పథకాలు



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్



పింఛన్లు పంపిణీ చేస్తున్న వైకుంఠం జ్యోతి

ఆలూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యమని అలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. శనివారం సిద్దేశ్వర కాలనీలో పింఛన్లు పంపిణీ చేశారు. డా నెట్టెప్ప, అంజి, గుండయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అవ్వ తాతలకు ఇచ్చిన మాటను సీఎం చంద్రబాబ నిలబెట్టు కున్నారని టీడీపీ నాయకురాలు వైకుంఠం జ్యోతి అన్నారు. శనివారం పట్టణంలో సర్పంచ్ అరుణ దేవితో కలసి పింఛన్లను పంపిణీ చేశారు.

చిప్పగిరి: టీడీపీతోనే అభివృద్ధి అని ఆ పార్టీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. శనివారం కుందనగుర్తి గ్రామంలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఎల్లంకి రజిని, నేమకల్ రవియాదవ్, దుబ్బనట్టప్ప, రామదుర్గం తిమ్మయ్య, చిప్పగిరి బోగేష్, సురేష్ పాల్గొన్నారు.

ఇలా అయితే కష్టమే

- ఎమ్మెల్యే పార్థసారథిని నిలదీసిన బీజేపీ కార్యకర్త
- పార్టీ మారిన వారికే ప్రాధాన్యమిస్తున్నారని అసంతృప్తి

ఆదోని, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పార్టీమారిన వారికే ప్రాధాన్యమిస్తున్నారని, కష్టపడిన మమ్మల్ని గుర్తించడం లేదని ఎమ్మెల్యే పార్థసారథిని కూటమి కార్యకర్త నాగశయన నిలదీశారు. పట్టణంలోని ఎంఎం కాలనీలో ప్రజల కోసం పార్థసారథి నిర్వహించారు. తనను బెదిరిస్తూ పోలీసు పెడతామంటున్నారని వలస కార్యకర్తలతో ఇబ్బంది పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ నుంచి వచ్చినవారు చివరి వరకు ఉండరని ఎమ్మెల్యేను వేడుకున్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ కూటమి నాయకులు, కార్యకర్తలను మర్చిపోనని ఎవరైన తనను నేరుగా కలవచ్చని హామీ ఇచ్చారు.

పశుగణనకు సహకరించాలి

మద్దికెర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పశుగణనకు సహకరించాలని పశువైద్యాధికారి కృష్ణ నాయక్ కోరారు. శనివారం మండలంలోని ఎం.అగ్రహారం, బీఎన్ పేట గ్రామాల్లో సర్వేను పరిశీలించారు. సర్వేతో టీకాలు, మందులు, ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు.

రసాభాసగా కౌన్సిల్

- దద్దరిల్లిన ఆదోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశం
- అజెండా పూర్తి కాకుండానే ముగింపు



పోడియం వద్ద బైఠాయించిన వైసీపీ కౌన్సిలర్లు

ఆదోని టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణ పురపాలక సంఘం సమావేశం రసాభాసగా ముగిసింది. అజెండా చర్చకు రాకుండనే మమ అనిపించారు. శనివారం చైర్‌పర్సన్ వాల్మీకి శాంత అధ్యక్షతన శనివారం మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఇద్దరు వైస్ చైర్మన్లు కూడా కౌన్సిలర్లతో పాటే కూర్చొనేలా ఏర్పాటు చేయడంతో వైసీపీ కౌన్సిలర్లు పోడియం ముందు బైఠాయించి చైర్‌పర్సన్‌పై ధ్వజమెత్తారు. కౌన్సిలర్లు కింద కూర్చోవడంతో, అధికారులు కూడా సమావేశం ముగిసే వరకు నిలబడే ఉన్నారు. కౌన్సిలర్ వెల్లాల లలిత శర్మ మాట్లాడుతూ, రెండు నెలలుగా కూర్చీల పెట్టుకుని అభివృద్ధి పనులపై చర్చించడం లేదని విమర్శించారు. తన వార్డు సమస్యలపై తన భర్త ఇంజనీర్‌ను కలిస్తే, నీచంగా మాట్లాడారని ప్రజా ప్రతినిధులకు అధికారులు ఇచ్చే గౌరవం ఇదేనా? అని ఆవేశంతో ప్రశ్నించారు. దీంతో కమిషనర్, ఎంఈ క్షమాపణలు కోరడంతో శాంతించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో అవినీతిపై పూర్తి విచారణ జరిపించాలని బీజేపీ మద్దతుదారులైన వైసీపీ కౌన్సిలర్లు వెల్లాల లలిత శర్మ, సురేష్, చిన్న, వసీం, ప్ల కార్డులతో తమ నిరసన వ్యక్తం చేసారు. ఒక దశలో వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్ లలితశర్మ మధ్య తీవ్రంగా వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. 35వ అంశాన్ని ఆమోదించి, ప్రభుత్వానికి పంపకుంటే నిధులు ఆగిపోయే ప్రమాదం ఉందని కమిషనర్ చెప్పడంతో కౌన్సిలర్లు అమోదించారు. వైసీపీకి చెందిన చైర్‌పర్సన్‌కు, అదే పార్టీకు చెందిన ఇతర కౌన్సిలర్లకు మధ్య చైర్మన్ పదవిపై వివాదంతో నాలుగు నెలలుగా సమావే శాలు గందరగోళంగా మారాయని సమస్య లపై చర్చించడంలేదని స్థానికులు విమర్శసిస్తున్నారు.

బస్సును ఢీకొన్న బైక్

తుగ్గలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న బస్సును వెనుక నుంచి బైక్ ఢీకొట్టడంతో చోదకుడు వంశీకి తీవ్రగాయాలయ్యాయి. శనివారం ఆర్టీసీ బస్సు గుత్తి నుంచి మంత్రాలయానికి వెళు తుండగా, కొత్తూరు నుంచి పత్తికొండకు బైక్‌పై వెళ్తున్న వంశీ వెనుక నుంచి ఢీ కొట్టాడు. వంశీ కాలు విరిగింది. చూచిన వారు పత్తికొండకు అనంతరం కర్నూలుకు తరలించారు.

ఆందోళనకు సిద్ధం

హోళగుంద, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎల్లెల్సీకి డిసెంబరు 15వరకు వరకు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు టీబీ అధికారులు ప్రకటించడంపై సాగు నీటి సంఘం మాజీ అధ్యక్షుడు తప్పేట రామిరెడ్డి మండ్డిపడ్డారు. రైతులు ఆందోళనకు సిద్ధం అవుతున్నట్లు తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

మంత్రాలయం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని అమలు చేయాలంటే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్ రాఘవేంద్ర రెడ్డి, జనసేన ఇన్‌చార్జి, ఐక్యవాల్మీకి పోరాటకమిటీ రాష్ట్ర అధ్యక్షులు, బీసీ సంక్షేమ సంఘం రాయలసీమ కన్వీనర్ లక్ష్మన్న అన్నారు. శనివారం మండలంలోని రచ్చమర్రిలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల సంయుక్త ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. నాయకులకు శాలువా పూలమాలలో రచ్చమర్రి టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి, మాజీ సర్పంచ్ చావిడి వెంకటేష్, మాజీ జడ్పీటీసీ ఆర్ లక్ష్మయ్య, టీడీపీ నాయకులు ఉసేని, పోలిశివ, వీరేష్, ఏసేపు, ఆనందు, నాగన్న, శ్రీనివాసులు, వెంకట్రాముడు, తలారి అనుమంతు, విష్ణువర్ధన్, యాగంటి ఈరన్న, నాగరాజు, రాము, బాలరాజు, ఈరన్న, వీఆర్‌ఓ నర్సప్ప తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంలో రాష్ట్రంలో మంత్రాలయం ప్రథమంగా ఉండాలి : రాఘవేంద్ర రెడ్డి

మంత్రాలయం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో టీడీపీ సభ్యత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి నియోజకవర్గ సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మాధవరం గ్రామంలో పెద్దకడుబూరు మండలంలోని కంబలదిన్నె గ్రామంలో టీడీపీ నాయకులు గజ్జల చిన్న నాగన్న, నాగేంద్ర, భీమేష్, హనుమంతు, బసప్ప సభ్యత్వంపై చర్చించారు. అదే విధంగా త్వరలో జరిగే సాగునీటి ఎన్నికల్లో చేపట్టాల్సిన ప్రణాళికలపై సమీక్షించి శాలువ, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు రఘునాథరెడ్డి, బొజ్జప్ప, భీమిరెడ్డి, నాగరాజు, కేశన్న, షఫీ, తెర్నేకల్ రఘు, బసప్ప, హుశేనీ, భీమరాయుడు, తాయన్న, కంబలదిన్నె నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.



రచ్చమర్రిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ, జనసేన ఇన్‌చార్జిలు రాఘవేంద్రరెడ్డి, లక్ష్మన్న

పెద్దకడబూరు: సమాజంలో పేదరిక నిర్మూలనకు అందిస్తున్న ఎన్టీఆర్ పెన్షన్ దారులకు ఒక్కరోజు ముందుగానే పండుగ వచ్చిందని టీడీపీ తెలుగు రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలోని పెన్షన్లు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు ఏసేబు,చిన్న కడబూరు టీడీపి నాయకుడు నరసన్న పెన్షన్ లబ్ధిదారులకు ఒక్కరోజు ముందుగానే పెన్షన్‌ను పంపిణీ చేశారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయండి

కోసిగి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావం విజయవంతం చేయాలని కోసిగి హిందూ సంఘాల నాయకులు శ్రీరాములు, రాజు, రామాంజనేయులు, వెంకటేష్, సురేంద్ర, నరసారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం వారు మాట్లాడుతూ కోసిగిలోని సిద్ధారుఢ శాంత ఆశ్రమంలో ఆదివారం కోసిగి సంఘం మండల హిందూ సమ్మేళన సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు పాటించండి

మంత్రాలయం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు పాటించాలని మాధవరం ఎస్‌ఐ విజయకుమార్ అన్నారు. శనివారం గ్రామ సచివాలయం వద్ద గ్రామ కార్యదర్శి వేణుగోపాల్, వీఆర్వో నరసప్ప, ఆల్‌ఫ్రెడ్, మహాలక్ష్మి, ఉరుకుందు, పవన్ కుమార్‌ల ఆధ్వర్యంలో గ్రామ ప్రజలతో కలిసి సైబర్ క్రైమ్ నేరాల కరపత్రాలను విడుదల చేశారు. బస్సులు, ఆటోలు, దుకాణాలకు ప్రధాన కూడళ్లలో అవగాహన కల్పించేందుకు కరపత్రాలు అతికించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటీపీ, పరిచయం లేని వ్యక్తుల నుంచి ఫోన్లు రిసీవ్ చేయడం, ఓటీపీ నెంబర్లు చెప్పడం జరిగితే.. మోసపోతామని గుర్తించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీరేష్, రామకృష్ణ, వీరాంజనేయులు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో ముళ్లపొదలను తొలగించాలి

కోసిగి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని కడాపాలెం శ్మశానవాటికలో ముళ్లకంప చెట్లు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించేందుకు స్థలంలో ముళ్ల కంప చెట్లు పెరిగి పోగా.. మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించేందుకు స్థలం లేక ఇబ్బందిగా మారిందని కోసిగి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంత్యక్రియలు నిర్వహించేందుకు శ్మశాన వాటికలో అధికారులు కనీస ఏర్పాట్లు కూడా చేయడం లేదన్నారు. శ్మశానంలో పెరిగిన ముళ్లకంప చెట్లను తొలగించాలన్నారు. అలాగే నీటి ట్యాంకులు అదనంగా రెండు ఏర్పాటు చేసి కొళాయిల ద్వారా నీరును అందించాలని, కూర్చునేందుకు బల్లలు, రేకుల షెడ్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



కోసిగిలోని కడాపాలెం శ్మశానవాటికలో పెరిగిన ముళ్లకంపలు

చట్టాలపై అవగాహన అవసరం

పెద్దకడబూరు, నవంబరు (ఆంధ్రజ్యోతి)30: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగహన కలిగి ఉండాలని సీఐ మంజునాథ్ అన్నారు. శనివారం పెద్దకడబూరులోని సచివాలయంలోని గ్రామస్తులతో సివిల్ రైట్స్ డే అవగహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఒకరికొకరు కలిసికట్టుగా జీవనం కొనసాగించాలన్నారు. గొడవలకు, అల్లర్లకు దూరంగా ఉంటూ ప్రశాంతంగా గడపాలన్నారు. ప్రతి పౌరుడు తమ హక్కులను వినియోగించుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులపై అవగహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా పౌర హక్కులకు భంగం వాటిల్లితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నిరంజన్ రెడ్డి,రెవిన్యూ సిబ్బంది శ్రీనివాసులు,నరసన్న పాల్గొన్నారు.

గోనెగండ్ల: ప్రస్తుత సమాజంలో సైబర్‌నేరాలు పెరిగిపోతున్నాయని ఈ నేరాల పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన ఎంతో అవసరం అని సీఐ గంగాధర్ అన్నారు. శనివారం గోనెగండ్లలో సైబర్ నేరాలకు సంబంధించిన పోస్టర్స్‌ను ఆయన విడుదల చేశారు. ఈసందర్భంగా బస్టాండ్ ప్రాంగణం నందు ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ వ్యక్తి గత వివరాలను పరిచయం లేని వ్యక్తులకు ఇవ్వరాదన్నారు. తెలియని లింక్స్ క్లిక్ చేరాదని, లోన్ యాప్స్, వీడియోకాల్స్, పాస్‌పోర్టు డివెజర్ అప్‌డేట్ విషయాలలో చాల జాగ్రత్తగా ఉండాలని కోరారు. అనుమానం వస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సైబర్ నేరాలపై ఫిర్యాదుకు 1930 నెంబర్ కు కాల్ చేయాలన సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగునిచ్చేవారే గురువులు



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న హెచ్‌ఎంలు, టీచర్లు

మంత్రాలయం, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): సమాజంలో తాను వెలుగుతూ ఇతరులకు విద్య, బుద్ధులు నేర్పి ఉన్నత స్థాయిలో నిలిపే వారే గురువులని టీడీపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, మాధవరం, మంత్రాలయం హెచ్‌ఎంలు బోజరాజు, హంపయ్య అన్నారు. శనివారం మంత్రాలయం మండలం మాధవరం ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయురాలు నిరుపమ పదవీ విరమణ సభ నిర్వహించారు. పాఠశాలల్లో పనిచేసిన సేవలను కొనియాడి శాలువా, పూలమాలలు, మెమెంటోలు ఇచ్చి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రామ్మోహన్, గురురాజ్, జగదీష్, యుగంధర్, నీలకంఠస్వామి, విఠోభరావు, ప్రసన్నకుమారి,నాగరాజు, నాయక్, తారాదేవి, కల్పలత, ఈరమ్మ, ఎర్రన్న, కృపానందం, కుముద్వతి, చంద్రశేఖర్, నాగరాజు, కేశన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు



ట్రస్టును ప్రారంభిస్తున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సంతోష్ హెగ్డే

ఎమ్మిగనూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన సూక్ష్మ కళాకారుడు బారికి చంద్రశేఖర్ తన పేరుపై ఒక చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేశారు. బెంగుళూరు పట్టణంలో రెండు రోజు క్రితం కర్ణాటక వర్కింగ్ జర్నలిస్టు వాయిస్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సంతోష్ హెగ్డే చేతుల మీదుగా చారిటబుల్ ట్రస్టును ప్రారంభించారు. అలాగే సూక్ష్మకళాకారుడు బారికి చంద్రశేఖర్‌కు వర్కింగ్ జర్నలిస్టు వాయిస్ సంస్థ సేవారత్న బిరుదును ప్రధానం చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాలను సాధిద్దాం

ఎమ్మిగనూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అమరవీరుల ఆశయాలను సాధిద్దామని రైతుకూలీ సంఘం, ఐఎఫ్‌టీయూ సంఘాల నాయకులు ఏసేపు, ప్రసాద్, నరసన్న, అనీఫ్ మాల మహానాడు నాయకులు నరసన్న అన్నారు. శనివారం పట్టణివారులో గోనేగండ్ల రోడ్డులో ఉన్న రామన్నగౌడ్, హనుమంతు స్థూపాల దగ్గర జేమ్స్, ఉరుకుందప్పల సంస్మరణ సభలను భారతమ్మ, లక్ష్మన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్ర, నీలకంఠ పాల్గొన్నారు.

కబడ్డీ టోర్నమెంటు

కోసిగి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చిన్నభూంపల్లి గ్రామంలో జిల్లా స్థాయి ఓపెన్ కబడ్డీ టోర్నమెంటు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు అంజి, రవికుమార్, భీమా, నారాయణ తెలిపారు. వారు మాట్లాడుతూ కబడ్డీ టోర్నమెంటులో పాల్గొనే జట్లు డిసెంబరు 4వ తేదీలోపు తమ టీం పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. 5వ తేదీ నుంచి జిల్లా స్థాయి ఓపెన్ కబడ్డీ టోర్నమెంటు పోటీలు ప్రారంభిస్తున్నట్లు వారు తెలిపారు. పోటీల్లో గెలిచిన జట్టుకు రూ.10వేలు మొదటి బహుమతి, రెండో బహుమతి రూ.7వేలు, మూడో బహుమతి రూ.3వేలు అందజేస్తున్నట్లు తెలిపారు.